151

డా॥ శ్రీమతి నూనె త్రిపుర సుందరం.
రీడరు మరియు తెలుగు శాఖాధ్యక్షురాల
సి.హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిస్సా స్వయ
ప్రతిపత్తి మహిళా కళాశాల,
ఏలూరు, ప.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్.
పిన్ కోడ్ - 534 003



# మధూకేశ్వరోద్భవం – 'చిత్కళ' గేయకావ్యం
## పత్ర సమర్పణ

స్కాంధపురాణంలోని "మధుకేశ్వరోద్భవం" అనే ఉపాఖ్యానాన్ని తీసుకొని "కవిరత్న" నీలా జంగయ్యగారు "చిత్కళ" అనే గేయ కావ్యాన్ని రచించారు.

"చిత్కళ" అనే గేయ కావ్యానికి శ్రీ.బి.ఎస్.శాస్త్రి గారు 1985 లో ప్రకటించిన "ముఖలింగ దేవాలయ శాసనములు" మూలాధారం. ఇది ఉత్కళ దేశంలోని కళింగ ప్రాంతమైన ముఖలింగ క్షేత్రానికి సంబంధించిన స్థలపురాణం.

స్కాంధ పురాణంలోని మధూకేశ్వర ఉద్భవం దీనిలో ముఖ్య సంఘటనగా పేర్కొనవచ్చు. మధూకేశ్వరునికి ముఖలింగ క్షేత్రమైంది. ఆ క్షేత్ర మహత్యాన్ని తెలిపే కథే ఈ గేయ కావ్యం.

ఈ ముఖలింగ పూర్వకళింగ గంగరాజుల ఏలుబడిలో ఉన్నట్లు ఈ దేవాలయంలోని శాసనాలు చాటుతున్నాయి. అంతేగాక ఇక్కడ జైన్ భౌద్ధ ఆరామాలున్నట్లు పేర్కొనటం వలన మాతృస్వామిక వ్యవస్థ ఉన్నట్లు చెప్పవచ్చు.

ఈ క్షేత్రం కాశీక్షేత్రానికి సమానమైనది. కాశీలో గంగ, ముఖలింగంలో వంశధార ప్రవహిస్తుంది. నాలుగు యుగాలలో గోవిందకాననంగా మధూకేశ్వరంగా జయంతీ క్షేత్రంగా ముఖలింగ క్షేత్రంగా పిలవబడింది. ఇక్కడే కోటిలింగాల క్షేత్రం ఉంది. ప్రధాన లింగానికి ముఖం ఉండటం చేత ఈ క్షేత్రానికి ముఖలింగమనే పేరు వచ్చింది. పద్మనాభుడు ఈ క్షేత్ర పాలకుడు పరమశివుడు మధూక వృక్షం నుంచి ఆవిర్భవించడం వల్ల మధూకేశ్వరుడయ్యాడు. ఈ క్షేత్రాన్ని మధూకేశ్వరమని పిలుస్తారు. శబరులు నివసించే గిరి గహన క్షేత్రాలు నాగరికుల మన్ననలకు పాత్రమైనవే.

2. బ్రహ్మకోరిక :-

ఈ స్థల పురాణంలో ఇలా ఉంది. బ్రహ్మమహేంద్రగిరిపై తనకు పూజార్హత సిద్ధించాలనే మాధవ వనం కాశీతో సమానం కావాలనీ హరిహరులను గూర్చి నూరు సంవత్సరాలు తపస్సు చేసెను. ఆహరిహరులు బ్రహ్మకు సాక్షాత్కరించి కాలాంతరంలో తన కోరికలు నెరవేరగలవని చెప్పి అంతర్ధానమయ్యారు. బ్రహ్మ తన కోరికలు నెరవేరగలవనే ఆనందంతో బ్రహ్మ లోకం చేరాడు.

3. తుంబుర నారదుల యజ్ఞం :-

నారాయణుని ప్రీత్యర్థం హిమవత్పర్వత ప్రాంతంలోని మందాకినీ తీరంలో తుంబుర నారదులు యజ్ఞం చేయుటకు నిశ్చయించారు. ఆ యజ్ఞానికి సిద్ధ, సాధ్వ, విద్యాధర, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుడు, హరిహరాదులతో బాటు సమస్త ఋషుల్ని ఆహ్వానించారు. యజ్ఞం అరంభమైంది. అమరులగాన మాధుర్యానికి ఆ ప్రాంత శబరజనం పారవశ్యంలో సమ్మోహితులయ్యారు. శబరకాంతలను చూసిన గంధర్వులు వ్యామోహితులైన విధానాన్ని పరికించిన వామదేవ మహర్షి గంధర్వులను శబరులందు జన్మించుడని శపించాడు. తమ తప్పిదము నొప్పుకొని శాపమునుసంహరించమని వేడుకొన్నారు. అప్పుడు ఋషి గంధర్వులతో శ్రీమన్నారాయణుని ప్రార్థించమని చెప్పాడు. గంధర్వులు నారాయణుని వద్దకు వెళ్ళి ప్రార్థించగా నారాయణుడు బ్రాహ్మణశాప మమోఘమని చెప్పి శివుని వద్దకు పంపించాడు. గంధర్వులు పరమశివుని ప్రార్థించగా పరమశివుడు వారిని చూచి మాధవ వనమందున్న శబర స్త్రీలలో జన్మించి కాలాంతరంలో తన దర్శనంతో ముక్తులవుతారని తెలిపి పంపించాడు.

4. పద్మనాభగిరి :-

పద్మనాభగిరి ప్రాంతంలో శభరులు నివసిస్తుండేవారు. శివుడు పార్వతితో ప్రమధగణాలు ప్రస్తుతించగా ఆ గిరివనంలో ఒక మధూక వృక్షం మూలన నివసిస్తుండేవాడు.

వామదేవ మహర్షి చేత శపింపబడిన గంధర్వులు పద్మనాభగిరి ప్రాంతంలో శబరుల్లో జన్మించి పూర్వజన్మ జ్ఞానం లేనివారై శబరుల వలె నివసించసాగారు. వేట మొదలైన శబర వృత్తుల్ని అవలంబించి మాంసాహారులై జీవించసాగారు. కాల క్రమేణా ఆ శబరుల్లో చిత్ర గాయకుడనువాడు వారికి నాయకుడయ్యాడు. శబరులు వేటాడి తెచ్చిన జంతువుల్ని నాయకునికి సమర్పిస్తుండేవాడు. అతని గాన మాధుర్యానికి మృత జంతువులు కూడా జీవం పొందేవి. ఇది చూసిన శబరులు మిక్కిలి ఆనందిస్తూ నామ సార్థకుడని ప్రస్తుతించేవారు.

రూపవంతుడూ, గుణవంతుడూ, బలవంతుడూ, పరాక్రమవంతుడైన చిత్రగాత్రుడు కులకాంత చిత్కళ అనే పేరు గల స్త్రీ కాశీ క్షేత్రాన్ని దర్శించే లక్ష్యంతో శ్రీశైలం నుండి బయలుదేరి అయా శివ క్షేత్రాల్ని దర్శిస్తూ కాలినడకన దారి తప్పి పద్మనాభగిరి చేరుకుంది. ఆ కొండపైనున్న చిత్రగాత్రుని ప్రేమించి అతని రెండో భార్యగా జీవించసాగింది.

చిత్రగాత్రుడు తన ఇర్వురి భార్యలైన చిత్తికి, చిత్కళకు మధూక వృక్షం చేరి ఒక స్కంధాన్ని ఇచ్చి, ఆ స్కంధం నుంచి రాలిన పూలనమ్ముకొని జీవనం చేసుకోవలసిందిగా ఏర్పాటు చేస్తాడు. కానీ దక్షిణ శాఖ నుండి రాలిన పూలకే [illegible] వ ధర వచ్చేది.

ఆ కారణం చేత చిత్తి తన భర్తతో తగువు పెట్టుకొని దక్షిణ శాఖనిమ్మని అడుగుతుంది. అతడలాగే ఏర్పాటు చేస్తాడు. అయినప్పటికీ చిత్కళకిచ్చిన ఉత్తర శాఖనుండి పూలకే అధిక ధర రాసాగింది. దానితో కోపగించిన చిత్తి తన భర్తతో తగువు పెట్టుకొని చెట్టంతా తనదేననీ, చిత్కళ మాయావి యనీ ఆమెను విడిచి పెట్టాలని పలుకుతుంది. ఈ తగాదాలతో విసిగిపోయిన చిత్రగాత్రుడు ఆవేశపూరితుడై తన భార్యల కలహానికి మూలమైన మధూక వృక్షం మూలాన్ని గొడ్డలితో నరుకుతాడు. వెనువెంటనే ఆ మూలం నుండి గొప్ప కాంతితో లింగమావిర్భవించగా చూసిన అతడు మూర్ఛిల్లుతాడు. ఆ ప్రాంత శబరులంతా అక్కడ గుమికూడుతారు. పరమశివుడు ఆ వృక్ష కోటరం నుండి ముఖలింగరూపుడై పార్వతీ సమేతంగా దర్శనమిచ్చి వారిని శాపవిముక్తుల్ని చేస్తాడు. అక్కడే నిలిచి మధూకేశ్వరునిగా సమస్త ప్రజల పూజలందుకోసాగాడు.

5. వనలక్ష్మి జాతర :-

వనలక్ష్మి జాతరను కవి ఇలా గేయంలో వర్ణించారు.

" పువ్వుల తావుల నవ్వుల నిండుగ
మధుర నాదముల మధుపము లలరగ
చిత్తి చిత్కళలు చిత్రగాత్రుకుడి
ఎడమల సాగగ వడి వడి మ్రోగే"
"సంతోషమ్మున సాగుచు చూడగ
జయజయ ధ్వనుల జాతర సాగెను
సర్వ సవర జన సంతోషమ్ముగ
గిరి వర వన సంగీతము లలరగ."

6. చిత్తి వాదన :-

చిత్తి తన సవతియైన చిత్కళపై కోపించి భర్తతో వాదులాడిన విధానాన్ని కవి ఇలా చిత్రీకరించారు.

"ఎవ్వతి యా చిత్కళ నా
కేల దాని తగవు దేశ
ద్రిమ్మరి న్నీ దరి చేర్చితి
తీయని మాటలకు లొంగి
మాయలాడి దాని నింక
మరి యాదగ విడిచి పెట్టు
మని తే ప్రావేశముతో
పెనుగులాడే తన పతితో".

7. పరమేశ్వరుడు ప్రత్యక్షమైన విధానం :-

చిత్రగాత్రుడు తన భార్యల తగువులకు కారణమైన మధూక వృక్షాన్ని గండ్ర గొడ్డలితో నరుకుతాడు. అప్పుడు మధూక వృక్షం మూలనున్న పరమేశ్వరుడు వింత కాంతితో ప్రత్యక్షమైన విధానాన్ని కవి ఇలా వర్ణించారు.

"వృక్షమూలమును నరికెను
తక్షణమే విరిగె చెట్టు
ఫెళ ఫెళమను చప్పుడుతో
తళ తళమను మెరుపులతో
వృక్షకోటరమ్ము నుండి
వింత కాంతి ధగధగమని
కోటి సూర్యప్రభా భాస
మౌట చిత్రగాత్రుడంత
చూడలేక మూర్ఛనొందే".

"శివుడు పార్వతీయుతుడై
చెట్టు మొదట ప్రమాదాదుల
చేపరి వేష్టితుడయ్యెను".

జంగయ్యగారు ఈ గేయ కావ్యాన్ని అనేక వర్ణనలతో సులభ శైలిలో మనోహరంగా తీర్చిదిద్దారు.

